"పునాదికి వాడాల్సిన సున్నం కాదిది. ఎండిపోయిన దీని శక్తి తగ్గి ఇది నాసిరకం అయింది." నిరాకరిస్తూ చెప్పాడు తండ్రి.

"కాని నాన్న. మనం భూమి లోపల ఓ రాయికి నాసిరకం సున్నం వాడామని ఎవరికి తెలుస్తుంది?" ప్రశ్నించాడు కొడుకు.

"ముగ్గురికి తెలుస్తుంది. వారిలో ఇద్దరు సిగ్గుతో మరణిస్తారు." చెప్పాడు తండ్రి.

"ఎవరా ముగ్గురు?" ప్రశ్నించాడు కొడుకు.

"నువ్వు. నేను. దేవుడు." జవాబు చెప్పాడు తండ్రి.

నీతి: మనం చేసే ఏ పనైనా భగవంతుడుకి తెలుస్తుంది అన్న స్పృహతో నైపుణ్యంగా చేయాలి.

## 102. గురుత్వం

ఓ గురువు దగ్గరకి ఆమె శిష్యుడి భార్య వచ్చి చెప్పింది.

"స్వామీ! మా వారు మిఠాయిని ఎక్కువగా తింటున్నారు. ఆ అలవాటుని మానమని దయచేసి వారికి చెప్పండి."

"నెల తర్వాత అతన్నోసారి నా దగ్గరకి తీసుకురా." చెప్పాడు గురువు.

నెల తర్వాత ఆమె తన భర్తతో గురువు దగ్గరకి వచ్చింది.

"బాబూ. రేపటి నించి నువ్వు మిఠాయి తక్కువగా తినాలి. అది ఆరోగ్యానికి కీడు చేస్తుంది." చెప్పాడు గురువు.

"ఈ ముక్క చెప్పడానికి నెలాగి రమ్మన్నారే? ఇది అప్పుడే చెప్పచ్చుగా?" ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

"అప్పుడు నేను కూడా మీ వారిలా ఎక్కువగా మిఠాయి తినేవాడిని. ముందర నేనా అలవాటుని మానుకున్నాకే నాకు అతనికి చెప్పడానికి అర్హత వస్తుంది కాబట్టి ఈ నెలంతా నేను మిఠాయిని తగ్గించే సాధన చేసాను." జవాబిచ్చాడు గురువు.